ఫింగర్ ప్రింట్ ఉంటేనే సిమ్ కార్డు

- యూజర్ల వ్యక్తిగత డాటా దుర్వినియోగానికి చెక్
- కంపెనీల నుంచి వచ్చే కాల్స్ బెడదకూ ముగింపు
- సెప్టెంబర్ 15 నుంచి కొత్త టెలికం నిబంధనలు?!
- కొత్త సర్కారు వచ్చిన వంద రోజుల్లో అమలే ఎజెండా

న్యూఢిల్లీ/(స్పెషల్ టాస్క్ బ్యూరో), మే 22: మీ పేరు మీద సిమ్‌కార్డు తీసుకోవాలంటే ఏం చేస్తారు? అధీకృత డీలర్‌కు మీ ఆధార్ కార్డు చూపించి సిమ్ తీసుకొంటారు కదూ. అయితే, ఒకే ఆధార్‌పై ఆ వ్యక్తికి తెలియకుండానే నకిలీ సిమ్‌కార్డులు తీసుకొంటున్న ఉదంతాలు ఇటీవల పెరిగిపోయాయి. దీంతో వీటికి చెక్ పెట్టేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ (డీవోటీ) కీలక నిర్ణయం తీసుకొన్నది. కొత్త టెలికం నిబంధనలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి ఈ రూల్స్ అమలయ్యే అవకాశం ఉన్నదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ట్రాయ్ సిఫారసు చేసిన ఈ రూల్స్.. లోక్‌సభ ఎన్నికలు పూర్తై కొత్త ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోగా అమల్లోకి తీసుకురావాలని డీవోటీ లక్ష్యంగా పెట్టుకొన్నది. శతాబ్దం నాటి టెలికం చట్టాన్ని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టెలికమ్యూనికేషన్స్ బిల్లు-2023ను పార్లమెంట్ గత ఏడాది డిసెంబర్ 20న ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ చట్టం అమలు ద్వారా ప్రస్తుతం కొనసాగుతున్న టెలికం నిబంధనల్లో పలు కీలక మార్పులు రానున్నాయి.

కొత్త నిబంధనలు ఎలా ఉంటాయంటే?

- ఇప్పటివరకూ ఉన్నట్టు కొత్త సిమ్ కార్డు కనెక్షన్ కావాలంటే ఆధార్ కార్డు చూపిస్తే సరిపోదు. సిమ్ కావాలనుకొన్న వ్యక్తి తప్పనిసరిగా బయోమెట్రిక్ వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందే. ఈ మేరకు టెలికం కంపెనీలు తప్పనిసరిగా వ్యక్తుల ఫింగర్‌ప్రింట్ తనిఖీ ప్రక్రియను పూర్తి చేయాల్సిఉంటుంది.
- నకిలీ సిమ్ కార్డులు, సైబర్ మోసాలను నివారించేందుకే ఈ కొత్త నిబంధన తీసుకొస్తున్నట్టు అధికారులు తెలిపారు.
- వివిధ కంపెనీల నుంచి రోజూ వందలాది ఫోన్‌కాల్స్ కస్టమర్లకు వస్తుండటం తెలిసిందే. దీంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. అలాగే వ్యక్తిగత గోప్యతపై కూడా ఆందోళన వ్యక్తమవుతున్నది.
- దీనికి చెక్ పెట్టేందుకు.. టెలికం కంపెనీలు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, ఇంటర్‌మీడియరీ కంపెనీలు వినియోగదారుల సమాచారం సేకరించే విషయంలోనూ స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయనున్నారు.

స్పెక్ట్రమ్ కేటాయింపుల్లోనూ మార్పులు

శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీసులకు స్పెక్ట్రమ్ కేటాయింపు ప్రక్రియలోనూ మార్పులు రానున్నాయి. వినియోగదారులకు డైరెక్ట్ రిటైల్ సర్వీసులు అందించే వాటి కంటే పాయింట్-పాయింట్ కనెక్షన్లు అందించే శాటిలైట్ కంపెనీలకు స్పెక్ట్రమ్ కేటాయించాలని టెలికమ్యూనికేషన్స్ విభాగానికి ట్రాయ్ సూచించింది. శాటిలైట్ కంపెనీలు నేరుగా ప్రయోజనం పొందలేని, అలాగే టెలికం కంపెనీలకు ఎలాంటి సమస్యలకు తలెత్తకుండా ఉండేలా ఈ కేటాయింపు ప్రక్రియ ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీసులను ప్రారంభించాలంటే, కంపెనీలు ప్రభుత్వం నుంచి స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కాగా, సైబర్ మోసాలకు చెక్ పెట్టే చర్యల్లో భాగంగా దేశంలో ఇటీవల టెలికం కంపెనీలు దాదాపు 18 లక్షల మేర మొబైల్ నంబర్లను బ్లాక్ చేసిన విషయం తెలిసిందే.

ఒక్కో బిడ్డపై 75 లక్షలు!

- కాన్పు దగ్గర నుంచి డిగ్రీ చదువుల వరకు ఒక్కో సంతానంపై భారతీయులు వెచ్చిస్తున్న మొత్తమిది
- లిస్ట్‌లో డైపర్లు, వైద్యం, బట్టలు, చదువు, ఆహారం
- విదేశీ చదువైతే ఖర్చు రూ.1.5 కోట్లకు పైమాటే
- ఎడ్-ఫిన్‌టెక్ కంపెనీ 'ఎడ్యూ ఫండ్' తాజా నివేదిక
- పిల్లల్ని కనడానికి తటపటాయిస్తున్న కొత్త జంటలు
- పెరుగుతున్న ధరలు, వ్యయాలతో బెంబేలు
- జనాభా పెరుగుదల రేటులో క్షీణతకు ఇదీ కారణమే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా నిలిచిన భారత్‌లో జనాభా పెరుగుదల రేటులో క్రమంగా క్షీణత కనిపిస్తున్నది. ఇది ఇలాగే కొనసాగితే, పనిచేయగల శ్రామికశక్తి తగ్గిపోయి, వృద్ధుల జనాభా విపరీతంగా పెరుగుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ఉత్పాదకత తగ్గి ఆర్థికవ్యవస్థే కుప్పకూలే ప్రమాదం పొంచి ఉందన్న భయాలు మొదలయ్యాయి. దీంతో జనాభా పెరుగుదల రేటులో క్షీణతకు గల కారణాలను నిపుణులు విశ్లేషించడం ప్రారంభించారు.

బతకడం కష్టమనే..

ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు, ఒత్తిడి కారణంగా యువత సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతున్నట్టు కొన్ని నివేదికలు వెల్లడించాయి. జనాభా పెరుగుదల రేటుపై దీని ప్రభావం పడినట్టు వివరించాయి. అయితే, పెండ్లైన కొత్త జంటలు మునుపటిలా సంతానంపై ఆసక్తితో లేరని, పెరుగుతున్న ఖర్చులే దీనికి ప్రధాన కారణమని మెజారిటీ నివేదికలు తేల్చిచెప్పాయి. నగరాల్లో భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ మిగులుతున్న సంపాదన అంతంత మాత్రమేనని, దీంతో కొత్త జంటలు సంతానాన్ని వాయిదా వేయడం, లేదా అసలే వద్దనుకోవడం చేస్తున్నట్టు 'మింట్' ఓ నివేదికలో వెల్లడించింది.

కాన్పు దగ్గర్నుంచీ మొదలు..

కాన్పు దగ్గరినుంచి పిల్లలకు డైపర్లు, వ్యాక్సిన్లు, వైద్య ఖర్చులు, బట్టలు, స్కూలు, కళాశాల ఫీజులు, ఇంట్లో భోజనం, వినోదం, ఇతరత్రా ఖర్చులు.. బిడ్డ డిగ్రీ పట్టా పొంది ఉద్యోగం సంపాదించేవరకూ ఒక్కో భారతీయుడు తన సంతానంపై కనీసం రూ. 65 లక్షల నుంచి రూ. 80 లక్షల వరకూ ఖర్చు చేస్తున్నట్టు ఎడ్-ఫిన్‌టెక్ కంపెనీ 'ఎడ్యూ ఫండ్' తన నివేదికలో పేర్కొంది. సగటున ఈ ఖర్చును రూ. 75 లక్షలుగా అంచనా వేసింది. మెడిసిన్ వంటి కోర్సులను చదివితే రూ.95 లక్షలు, విదేశాల్లో చదివితే రూ.1.5 కోట్ల పైమాటేనని తేల్చిచెప్పింది.

పుట్టినప్పటి నుంచి 21 ఏండ్ల వయసు వచ్చే వరకు ఖర్చు ఇలా.. (అంచనా)

దవాఖానలో పురుడు (సిజేరియన్)	రూ. 70,000
18 నెలల వరకూ వ్యాక్సిన్లు, వైద్య ఖర్చులు	రూ. 50,000
డైపర్లు, బట్టలు, ఆహారం, పాలు	రూ. 80,000
ప్రీ-ప్రైమరీ, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్కూల్ ఫీజు	4 లక్షలు
ఒకటో తరగతి నుంచి ఎనిమిది వరకు ఫీజు	15 లక్షలు
9వ తరగతి, 10వ తరగతి ఫీజు	6 లక్షలు
ఇంటర్మీడియట్ రూ. 8 లక్షలు; డిగ్రీ విద్య (నాలుగేండ్ల ఇంజినీరింగ్) రూ. 10 లక్షలు	18 ఏండ్లపాటు భోజనం, బట్టలు, టూర్లు, వినోదం, వైద్యం, ఇతరత్రా ఖర్చు రూ. 30 లక్షలు
	మొత్తం ఖర్చు రూ. 75 లక్షలు

ఇంజినీరింగ్‌కు బదులు మెడిసిన్ విద్య చదివితే- 65 లక్షలు + రూ. 30 లక్షలు = రూ. 95 లక్షలు

ఇంజినీరింగ్ తర్వాత ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తే రూ. 1.5 కోట్ల పైమాటే

పసిడి ధరలతో కంచి పట్టు చీరల పోటీ

చెన్నై, మే 22: ఆకాశానికి ఎగబాకుతున్న పసిడి ధరలతో కాంచీపురం పట్టు చీరల ధరలు పోటీపడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా పుత్తడి రేట్లు పెరుగుతుండడంతో ఆ మేరకు పట్టుచీరల ధరలు కూడా పెరుగుతున్నాయి. కాంచీపురం పట్టుచీరల్లో ఎక్కువగా బంగారం, వెండి జరీని ఉపయోగిస్తారు. దీంతో బంగారం ధరలతోపాటు చీరల ధరలు కూడా పెరిగాయి. గత 8 నెలల్లో ఏకంగా 50 శాతం వరకు ధరలు పెరగడంతో మగువలు ఆ చీరలవైపు చూడాలంటేనే భయపడుతున్నారు. చీరల వ్యాపారం దారుణంగా పడిపోయిందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంచీపురం సిల్క్ చీరల్లో స్పెషలిస్ట్ బ్రాండ్ అయిన ఆర్ఎంకేవీ వ్యాపారం 20 శాతం పడిపోయింది.

సీటు లేదని నిలబడి ప్రయాణం

గుర్తించి దింపేసిన ఇండిగో ఫ్లైట్‌సిబ్బంది

ముంబై, మే 22: ముంబై విమానాశ్రయంలో వింత ఘటన చోటుచేసుకొన్నది. ముంబై నుంచి వారణాసికి వెళ్లాల్సిన ఇండిగో విమానంలోని అన్ని సీట్లు నిండిపోయాయి. టేకాఫ్‌కు ఫ్లైట్ సిద్ధమైంది. ఇదే సమయంలో ఓవర్‌బుక్ అయిన అఖిలేశ్ చౌబే అనే ప్రయాణికుడు విమానంలో నిలబడి ఉండటాన్ని గమనించిన సిబ్బంది.. పైలట్‌ను అలర్ట్ చేశారు. దీంతో పైలట్ విమానాన్ని తిరిగి వెనక్కు మళ్లించాడు. నిలబడ్డ ప్రయాణికుడిని దింపేసిన అనంతరం గంట ఆలస్యంతో విమానం బయలుదేరింది. బుకింగ్ విషయంలో చిన్న తప్పిదం జరిగిందని ఇండిగో సంస్థ తెలిపింది.

సత్య నాదెళ్లకు జరిమానా

కంపెనీ చట్టాల ఉల్లంఘనే

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ చీఫ్ సత్య నాదెళ్ల, ఆ కంపెనీ యాజమాన్యంలోని లింక్డ్‌ఇన్ ఇండియాలతోపాటు మరో ఎనిమిది మందికి కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం జరిమానా విధించింది. కంపెనీల చట్టాన్ని ఉల్లంఘించినందుకు రూ.27.10 లక్షలు చెల్లించాలని వీరిని ఆదేశించింది. ప్రధాన లబ్ధిని పొందే యజమాని (సిగ్నిఫికెంట్ బెనిఫిషియల్ ఓనర్) నిబంధనలను ఉల్లంఘించినందుకు వీరిపై ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల కంపెనీల రిజిస్ట్రార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలపై రీజనల్ డైరెక్టర్ వద్ద 60 రోజుల్లోగా అప్పీలు చేయవచ్చు.

స్వతంత్ర పాలస్తీనాను గుర్తిస్తున్నాం

బార్సిలోనా (స్పెయిన్), మే 22: ఇంతకాలం ఇజ్రాయెల్‌తో సఖ్యతగా వ్యవహరించిన నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ తమ వైఖరిని మార్చుకున్నాయి. 'స్వతంత్ర పాలస్తీనా'ను తాము గుర్తిస్తున్నట్టు అవి బుధవారం ప్రకటించాయి. ఈ నెలలో ఉత్తర, దక్షిణ గాజా స్ట్రిప్ ప్రాంతాల్లో ఇజ్రాయెల్ దాడులు జరపడం, దాని కారణంగా వేలాది మంది కొత్తగా వలసలు పోవడం, ఆ దేశానికి అందే సహాయాన్ని అడ్డుకోవడం, అక్కడ కరవు పరిస్థితులు అధికం కావడం తదితర కారణాలతో ఈ మూడు దేశాలు స్వతంత్ర పాలస్తీనాకు మద్దతు ప్రకటించాయి. ఈ ప్రకటన ఇజ్రాయెల్‌కు ఖేదాన్ని మిగల్చగా, పాలస్తీనా మాత్రం హర్షం వ్యక్తం చేసింది. ఈ చర్యతో కినుక వహించిన ఇజ్రాయెల్ నార్వే, ఐర్లాండ్ దేశాలలో ఉన్న తమ దేశ దౌత్యవేత్తలను వెనక్కి రమ్మని ఆదేశించింది.

కోల్‌కతాలో బంగ్లా ఎంపీ హత్య

సీఐడికి కేసు అప్పగింత

కోల్‌కతా: బంగ్లాదేశ్ అధికార పార్టీ అవామీ లీగ్ ఎంపీ అన్వరుల్ అజీం అనర్ కోల్‌కతాలో హత్యకు గురయ్యారు. అన్వరుల్ ఈ నెల 12న కోల్‌కతాకు వచ్చారు. ఆ మర్నాడు వైద్య పరీక్షల కోసం మిత్రులతో కలిసి బిధాన్ నగర్‌లో ఓ ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత కనిపించలేదు. తన తండ్రి ఫోన్ తీయడం లేదని బంగ్లాదేశ్‌లో ఉన్న ఆయన కుమార్తె ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో బారానగర్ పోలీస్ స్టేషన్‌లో 18న ఫిర్యాదు చేశారు. అన్వరుల్ మృతదేహాన్ని పోలీసులు న్యూటౌన్‌లో గుర్తించారు. ఈ కేసులో ముగ్గురు బంగ్లా దేశీయులను బంగ్లాదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసును సీఐడీకి అప్పంచినట్టు అధికారులు చెప్పారు.

వీసాల తగ్గింపుపై వెనక్కి తగ్గిన యూకే

లండన్, మే 22: భారత్ విద్యార్థులకు యూకే ప్రభుత్వం శుభవార్త చెప్పింది. బ్రిటన్‌లో గ్రాడ్యుయేట్ రూట్ వీసాల జారీ సంఖ్యను తగ్గించాలన్న ప్రభుత్వ ప్రణాళికను విరమించుకోవాలని ప్రధాని రిషి సునాక్ నిర్ణయించారు. ఈ వీసాలు తగ్గితే భారత విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయి. దీన్ని సునాక్ సొంత మంత్రివర్గ సభ్యులే వ్యతిరేకించారు. ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్న విదేశీ విద్యార్థుల్లో 40 శాతం భారతీయులే. అంతర్జాతీయ విద్యార్థులకు గ్యాడ్యుయేట్ రూట్ వీసాల జారీని తగ్గిస్తే దేశంలోని యూనివర్సిటీలు, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని విదేశాంగ కార్యదర్శి డేవిడ్ కేమరన్ సహా పలువురు మంత్రులు సునాక్ నిర్ణయానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ వీసా ఉన్న విద్యార్థులకు తమ చదువు పూర్తయ్యాక రెండేండ్లు యూకేలో ఉద్యోగం చేయడానికి అనుమతి ఇస్తారు. అయితే దాన్ని ప్రతిభావంతులకు మాత్రమే ఇవ్వాలని సునాక్ తొలుత ఆలోచించారు. మంత్రివర్గం నుంచి వ్యతిరేకత రావడంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు.

నిందితుడు నడిపిన కారు, ప్రమాదానికి ముందు పబ్‌లో టీనేజర్

గంటన్నరలో 48 వేలు ఖర్చు

- పుణె టీనేజర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి
- బెయిల్ రద్దు చేసిన కోర్టు.. అబ్జర్వేషన్ హోంకు తరలింపు
- 25 ఏండ్ల వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వొద్దని నిర్ణయం

పుణె, మే 22: మద్యం మత్తులో లగ్జరీ కారును నడిపి ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను బలి తీసుకున్న పుణెకు చెందిన టీనేజర్ ఆ ప్రమాదానికి ముందు పబ్‌లో కేవలం 90 నిమిషాల్లో 48 వేలు ఖర్చు చేశాడు. ప్రమాదానికి ముందు అతడు స్నేహితులతో కలిసి రెండు పబ్‌ల్లో మద్యం సేవించాడు. దీంతో, మైనర్లకు మద్యం సరఫరా చేసిన ఈ రెండు పబ్‌లను మంగళవారం సీజ్ చేసినట్టు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. పరారీలో ఉన్న టీనేజర్ తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే పబ్ ఓనర్‌తో పాటు ఒక ఉద్యోగిని అరెస్ట్ చేశారు. మరోవైపు జువైనెల్ కోర్టు టీనేజర్ బెయిల్‌ను రద్దు చేసి జూన్ 5 వరకు అతడిని అబ్జర్వేషన్ హోమ్‌లో ఉంచాలని ఆదేశించింది.

ఇద్దరి ప్రాణాలు తీసినా..

వ్యాసం రాయమని బెయిల్ ఇచ్చారు

నిర్లక్ష్యంగా కారు నడిపి ఇద్దరు యువ ఉద్యోగులను పొట్టనబెట్టుకున్న టీనేజర్‌కు ఆ రోజే న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం అందరినీ షాక్‌నకు గురి చేసింది. రోడ్డు ప్రమాదాలపై ఒక వ్యాసం రాయమని చెప్పిన జువైనల్ జస్టిస్ బోర్డు(జేజేబీ).. అది రాసిన వెంటనే బెయిల్ మంజూరు చేయడాన్ని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. జేజేబీ అతి విశాల హృదయంతో బెయిల్ మంజూరు చేయడం పట్ల మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా, నిందితుడికి 25 ఏండ్ల వయసు వచ్చేవరకు అతడికి డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయరాదంటూ మహారాష్ట్ర రవాణా శాఖ నిర్ణయించింది. అలాగే ప్రమాదానికి కారణమైన లగ్జరీ కారు పోర్స్చే టేకాన్‌కు సంబంధించిన ఫీజు చెల్లించనందున దాని పర్మినెంట్ రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు చెప్పారు. కాగా, బాలుడి తాతయ్యకు అండర్‌వరల్డ్ డాన్ చోటారాజన్‌తో లింక్ ఉన్నట్టు సీబీఐ వర్గాలు వెల్లడించాయి.

5 లక్షల ఓబీసీ సర్టిఫికెట్లు రద్దు

కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

బీజేపీ ఆర్డర్‌ను ఒప్పుకోబోం: మమత

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): బెంగాల్‌లోని మమత సర్కారుకు కలకత్తా హైకోర్టులో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. బెంగాల్ ప్రభుత్వం 2010 తర్వాత జారీ చేసిన దాదాపు 5 లక్షల ఓబీసీ సర్టిఫికేట్లను హైకోర్టు బుధవారం రద్దు చేసింది. 2012లో బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన వెనుకబడిన తరగతుల చట్టం కింద జారీచేసిన ఈ ధ్రువపత్రాలన్నీ చట్టవిరుద్ధమైనవిగా కోర్టు అభిప్రాయపడింది. అయితే ఇప్పటికే ఈ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందినవారిపైనా, ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఉన్నవారిపైనా ఈ తీర్పు ప్రభావం ఉండదని వివరించింది. ఈ మేరకు ద్విసభ్య ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సామాజిక వర్గాలను ఓబీసీ జాబితా నుంచి తొలగించేలా వారు (బీజేపీ) ఈ ఆర్డర్ ఇచ్చారని ఆరోపించారు. దీనిని అంగీకరించేది లేదని చెప్పారు. ఓబీసీ రిజర్వేషన్ కొనసాగుతుందన్నారు.

'క్లైమెట్'లో చిక్కుకొన్న విమానం

- ఆకాశంలో పెరుగుతున్న కుదుపుల ఘటనలు
- 2050 నాటికి ప్రమాదాల్లో 200% పెరుగుదల

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం భారీ కుదుపులకు లోనవ్వడం యావత్తు ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. 1979 నుంచి 2020 మధ్య విమానాల కుదుపులకు సంబంధించిన ప్రమాదాలు 55 శాతం మేర పెరిగినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. 2050 నాటికి ఈ తరహా ప్రమాదాలు 200 శాతం మేర పెరుగొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి.

వేడెక్కడంతోనే ప్రమాదాలు

భూతాపం కారణంగా ఆకాశంలో సంభవిస్తున్న మార్పులే విమాన కుదుపులు పెరగడానికి కారణమని బ్రిటన్ వాతావరణ నిపుణుడు పాల్ డీ విలియమ్స్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులతో ఆకాశంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. దీంతో గాలిలో అలజడి తీవ్ర స్థాయిలో ఉంటుందని, అప్పుడు విమానం ప్రయాణిస్తే, భారీ కుదుపులు ఏర్పడతాయని గుర్తుచేశారు. భూ వాతావరణం వేడెక్కడం వల్ల ఆకాశంలో గాలి పలుచుగా మారుతుందని, ఇలాంటి సందర్భాల్లో మబ్బులు లేకున్నా విమానం కుదుపులకు గురయ్యే ఘటనలు జరిగినట్టు గుర్తు చేశారు.

ఆరోగ్యానికి 'పీడ కలే'!

లూపస్ వంటి వ్యాధులకు సూచన కావొచ్చు

లంగన్, మే 22: పీడ కలలు, భ్రమ, పగటి కలలు ఎక్కువగా రావడం.. లూపస్ వంటి జబ్బులకు సూచనలు కావొచ్చని లండన్‌కు చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, కింగ్స్ కాలేజ్ లండన్‌కు చెందిన పరిశోధకులు లూపస్ సహా ఇతర ఆటోఇమ్యూన్ వ్యాధులకు గురైన 69 మంది పేషెంట్లు, వారికి చికిత్స అందిస్తున్న 50 మంది వైద్యులను ఇంటర్వ్యూ చేశారు. ఈ అధ్యయనం వెల్లడైన అంశాలు 'ఈక్లినికల్ మెడిసిన్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ పేషెంట్లలో ప్రతి ఐదుగురిలో ముగ్గురికి పీడ కలలతో నిద్ర చెదిరిపోయే లక్షణం కనిపించింది. వీరిలో మూడింట ఒక వంతు మందిలో ఏడాది తర్వాత లూపస్ వ్యాధి మొదలైంది. లూపస్ వ్యాధి బారిన పడ్డ 85 శాతం మంది రోగులు ఎక్కువగా 'భ్రమ పడటం' లక్షణాన్ని అనుభవించారని తేలింది. రోగుల్లో ప్రతి ఐదుగురిలో ముగ్గురికి, ఇతర రుమటాలజీ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న ప్రతి ముగ్గురిలో ఒకరికి నిద్రలో కింద పడిపోయినట్టు, గాయపడ్డట్టు, భ్రమలు ఎక్కువగా వచ్చినట్టు గుర్తించారు. లూపస్ వ్యాధి మెదడు సహా వేర్వేరు భాగాలపై ప్రభావం చూపుతుంది.

వేడి రోజుల్లో దవాఖాన ముప్పు రెట్టింపు



న్యూఢిల్లీ: మధుమేహం, ఊబకాయం, హైపర్‌టెన్షన్ వంటి మెటాబొలిక్ డిజార్డర్స్ ఉన్న రోగులు దవాఖానలో చేరవలసిన ముప్పు వేడి ఎక్కువగా ఉండే రోజుల్లో రెట్టింపు అవుతుంది. సాధారణ ఉష్ణోగ్రతలు గల రోజులతో పోల్చిపుడు ఈ పరిస్థితి కనిపిస్తున్నదని స్పెయిన్‌లో జరిగిన అధ్యయనం వెల్లడించింది. 'ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పెర్స్పెక్టివ్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయన నివేదిక ప్రకారం... 'ఊబకాయం ఉన్నవారి శరీరంలోని కొవ్వు ఇన్సులేటర్‌గా పని చేస్తుంది. ఫలితంగా వీరికి హీట్ డిజార్డర్స్ వచ్చే అవకాశాలు మరింత పెరుగుతాయి. వీరు దవాఖానలో చేరాల్సిన పరిస్థితిని పెంచడంలో గాలి కాలుష్యం కూడా దోహదపడుతుంది. గాయాలు తగిలినపుడు దవాఖానలో చేరాల్సిన అవసరం పురుషులకు ఎక్కువగా ఉంటుంది.' అని అధ్యయనం తెలిపింది. అంటువ్యాధులు, హార్మోనల్, మెటాబొలిక్ డిజార్డర్స్ గల మహిళలు దవాఖానలో చేరవలసిన అవసరం మరింత ఎక్కువగా ఉంటుందని వెల్లడించింది. వేడి వల్ల ఒత్తిడి కలిగిన పరిస్థితుల్లో ఎక్కువ రక్తం చర్మం వద్దకు ప్రవహిస్తుంది. చెమట ఉత్పత్తి అవుతుంది. దీనికి ప్రతి చర్యలు వ్యక్తుల వయసు, స్త్రీ, పురుషుడు, పూర్వపు ఆరోగ్య పరిస్థితులు వంటివాటిని బట్టి వేర్వేరుగా ఉంటాయని విశ్లేషించింది.

ఒకరి తల.. మరొకరికి!

- 'హెడ్‌ట్రాన్స్‌ప్లాంట్' సాధ్యమేనంటున్న అమెరికా స్టార్టప్
- రోబోలతో కూడిన వీడియో విడుదల.. నెట్టింట్లో వైరల్
- దేవుడిని అధిగమించలేరంటూ నెటిజెన్ల కామెంట్లు
- ఇప్పటికే జంతువులపై 'హెడ్‌ట్రాన్స్‌ప్లాంట్' ప్రయోగాలు
- ప్రతి ఒక్కటీ ఫెయిల్.. సున్నితమైన నాడీవ్యవస్థే సమస్య



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): 2008లో వచ్చిన హాలీవుడ్ సైన్స్‌ఫిక్షన్ సినిమా 'ఎక్స్ ఫైల్ – ఐ వాంట్ టూ బిలీవ్' చూశారా? ఈ మూవీలో ఒక వ్యక్తి తలను మరో వ్యక్తికి (హెడ్‌ట్రాన్స్‌ప్లాంట్) అమరుస్తారు. అయితే, ఈ సినిమాలో జరిగినట్టు నిజ జీవితంలో ఒక వ్యక్తి తలను మరొకరికి అమర్చడం సాధ్యమా? అంటే.. అవునంటున్నది అమెరికాకు చెందిన స్టార్టప్ కంపెనీ 'బ్రెయిన్ బ్రిడ్జ్'. 'హెడ్‌ట్రాన్స్‌ప్లాంట్' ఎలా చేయవచ్చో.. రోబోలతో చిత్రీకరించిన వీడియోనూ సోషల్ మీడియాలో విడుదల చేసింది.

ఏమిటీ 'హెడ్ ట్రాన్స్‌ప్లాంట్'?

ప్రమాదాల్లో అవయవాలు కోల్పోవడం, లేదా దెబ్బ తినడం జరిగితే దాతల నుంచి సేకరించిన అవయవాలను తీసుకొని 'ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్' చేసినట్టే ఒక వ్యక్తి తలను మరొకరికి అమర్చడాన్ని 'హెడ్ ట్రాన్స్‌ప్లాంట్' అంటారు.

వీడియోలో ఏముంది?

'బ్రెయిన్ బ్రిడ్జ్' విడుదల చేసిన వీడియోలో రెండు రోబోలు .. ఒక రోబో తలను మరో రోబోకు ఎలా అమర్చవచ్చో చూపించారు. స్టేజీ-4 క్యాన్సర్, పక్షవాతం, బ్రెయిన్ డెడ్, అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి నాడీ సంబంధ వ్యాధులతో సతమతమయ్యేవారి తలను తొలగించి, అప్పుడే మరణించిన వారి తలను పెట్టవచ్చని 'బ్రెయిన్ బ్రిడ్జ్' వీడియోలో పేర్కొంది.

నిజంగానే సాధ్యమా?

'హెడ్ ట్రాన్స్‌ప్లాంట్' ప్రయోగం కొత్తదేం కాదు. ఈ తరహా ప్రయోగాలు 1900లోనే ప్రారంభమయ్యాయి. ఇప్పటికే చాలామంది శాస్త్రవేత్తలు జంతువులపై ఈ ప్రయోగాలు చేశారు. 1954లో సోవియెట్ యూనియన్‌కు చెందిన ఓ సర్జన్ ఓ కుక్కకు 'హెడ్ ట్రాన్స్‌ప్లాంట్' చేశాడు. అయితే, సున్నితంగా ఉండే నాడీవ్యవస్థ, రక్తనాళాలు పనిచేయకపోవడంతో ఆ కుక్క కొన్ని రోజులకే మరణించింది. అందుకే, 'బ్రెయిన్‌బ్రిడ్జ్' వీడియోపై నెటిజెన్లు మిశ్రమ స్పందనలు వస్తున్నాయి.